


పంచలోహ విగ్రహాలు, వస్తువులు

అందాల పుత్తడి గంగాడ ఇత్తడి

బలిజిపేట, న్యూస్‌టుడే: బలిజిపేట మండలంలోని గంగాడలో తయారవుతున్న పంచలోహ విగ్రహాలు, ఇత్తడి వస్తువులకు గుర్తింపు లభించింది. గ్రామానికి చెందిన డ్వాక్రా మహిళలు తయారు చేసిన పలు వస్తువులను ఈ నెల 21న విజయవాడలో జరగనున్న డ్వాక్రా ఉత్పత్తుల ప్రదర్శనకు ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు కేంద్ర మంత్రులు పాల్గొంటారని వెలుగు పీడీ వై. సత్యంనాయుడు తెలిపారు. శనివారం ఆయన గ్రామంలో పర్యటించి విగ్రహాలు, వస్తువులను పరిశీలించారు. తయారీదారులు, మహిళలతో మాట్లాడారు. మాజీ సర్పంచి జి.గౌరీశంకరరావు, తెదేపా నాయకుడు ఎస్. రాధాకృష్ణ, డీపీఎం అప్పారావు, ఏపీఎం ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రభుత్వ సాయంతో అడుగులు..

ఈ గ్రామంలో ఇత్తడి కార్మిక కుటుంబాలు 32 ఉన్నాయి. వీరికి ప్రభుత్వం రూ.72 లక్షల బ్యాంకు రుణం మంజూరు చేసింది. 35 శాతం రాయితీతో 12 కుటుంబాలకు రూ.2.5 లక్షల చొప్పున, 20 కుటుంబాలకు రూ.2 లక్షల చొప్పున అందజేశారు. దీంతో వారు సొంతంగా సామగ్రి తయారు చేస్తున్నారు. బయట నుంచి వచ్చే ఆర్డర్ మేరకు రామాలయాలు, మందిరాల్లో ప్రతిష్ఠించేందుకు దేవతల విగ్రహాలు, పూర్ణ కలశాలు, విగ్రహాలు, గృహ వస్తువులు, ఇత్తడి వస్తువులు తయారు చేసి ఆన్‌లైన్ వ్యాపారం సాగిస్తున్నారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పుగోదావరి జిల్లాలకు తరలి వెళ్తున్నట్లు గ్రామస్థులు చెబుతున్నారు.


వస్తువులు పరిశీలిస్తున్న పీడీ సత్యంనాయుడు

24 నుంచి కాంగ్రెస్ సమావేశాలు

విజయవాడ (గవర్నర్‌పేట), న్యూస్‌టుడే : రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసేందుకు జిల్లా, నగర కమిటీలు, అనుబంధ విభాగాలతో ఏపీసీసీ అధ్యక్షురాలు వై.ఎస్.షర్మిల ఈనెల 24 నుంచి సమావేశాలు నిర్వహించనున్నారని ఏపీసీసీ ప్రధాన కార్యదర్శి ఎస్.ఎన్.రాజా తెలిపారు. ఏపీసీసీ కార్యాలయం ఆంధ్రరత్నభవన్‌లో 25న పార్వతీపురం మన్యం, విజయనగరం జిల్లాలవారు రానున్నారని చెప్పారు.

అర్హులైన వారికి పింఛన్లు అందించేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. డిసెంబరు నాటికి ఎంపికలు పూర్తి చేసి, వచ్చే ఏడాది జనవరి నుంచి నగదు అందించేందుకు ప్రణాళిక వేసింది. అందులో భాగంగా దరఖాస్తుల ప్రక్రియను ప్రారంభించాలని ఆదేశాలు జారీ చేసింది. అంతేకాకుండా గత ప్రభుత్వ హయాంలో నిబంధనలకు విరుద్ధంగా లబ్ధిపొందిన వారి వివరాలు సేకరించాలని సూచించింది. ఈ నేపథ్యంలో క్షేత్రస్థాయిలో అధికారులు కసరత్తు ప్రారంభించారు.



అర్హులారా.. అందుకోండి పింఛను

– న్యూస్‌టుడే, విజయనగరం మయూరికూడలి

ప్రస్తుతం 14 రకాల పింఛన్లు అందిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో 4.13 లక్షల మంది లబ్ధి పొందుతున్నారు. వీరి వివరాలను మరోసారి పరిశీలించనున్నారు. ముఖ్యంగా గత అయిదేళ్లలో నమోదైన వారి దస్త్రాలను తనిఖీ చేయనున్నారు. రెండు జిల్లాల్లో 49,622 మంది దివ్యాంగులకు పింఛను అందుతోంది. వీరిలో 100 మంది వరకు నిబంధనలకు విరుద్ధంగా నగదు తీసుకుంటున్నారని అధికారులకు ఫిర్యాదులు వెళ్లాయి. ఈమేరకు నోటీసులు సైతం అందించారు. ఇలాంటి వారిని ప్రత్యేక పరిశీలన అనంతరం తొలగించనున్నారు. అర్హులని తేలితే కొనసాగిస్తారు. మరోవైపు కొత్తవారికి అవకాశం ఇవ్వనున్నారు.

50 రోజుల ప్రణాళిక

నవంబరు నుంచి దరఖాస్తుల నమోదు ప్రక్రియ ప్రారంభం కానుంది. ఆ నెలలోనే తనిఖీలు చేపడతారు. అర్హులు, అనర్హుల జాబితాలను సచివాలయాల్లో ప్రదర్శిస్తారు. గ్రామ సభల దృష్టికి తీసుకెళ్తారు. అభ్యంతరాలొస్తే పరిశీలించి, సరిచేస్తారు. డిసెంబరు నెలాఖరు నాటికి ఎంపికలు పూర్తిచేయనున్నారు. 50 రోజుల ప్రణాళికలో భాగంగా ఈ ప్రక్రియ సాగనుంది.


క్షేత్రస్థాయిలో పింఛన్ల కోసం అర్హుల నుంచి దరఖాస్తుల స్వీకరిస్తున్న సచివాలయ సిబ్బంది

10 వేల మందికి పైనే..

గత ప్రభుత్వ హయాంలో.. అర్హులై, పింఛను కోసం దరఖాస్తులు చేసుకున్న వారిలో సుమారు 10 వేల మందిని పక్కన పెట్టారు. అప్పటి నాయకులు చెప్పిన వారికే లబ్ధిదారులుగా పరిగణించారనే ఆరోపణలున్నాయి. అలాగే రెండు జిల్లాల్లో 3,400 మంది దివ్యాంగులకు పింఛన్లు ఆపేశారు. వీరు ఉద్యమాలు చేసినా పట్టించుకోలేదు. వీరందరికీ ఇప్పుడు అవకాశం కలగనుంది. క్షేత్రస్థాయిలో తమ సిబ్బంది దరఖాస్తులు తీసుకుంటున్నారని, పారదర్శకంగా ఎంపిక జరుగుతుందని డీఆర్‌డీఏ పీడీ కల్యాణ్ చక్రవర్తి తెలిపారు.

ప్రారంభమైన దరఖాస్తుల ప్రక్రియ

కొత్తవారికి జనవరి నుంచి మంజూరు

'కొత్త సదరం ధ్రువపత్రం పొందాలనుకునే వారు ముందుగా సచివాలయాలను సంప్రదించాలి. ఆధార్, చరవాణి నంబరు తప్పనిసరి. ఓటీపీ ఆధారంగా వివరాలను నమోదు చేస్తారు. పరిశీలనకు గానూ జిల్లా, ప్రాంతీయ ఆసుపత్రులు, నిపుణులున్న సీహెచ్‌సీలను కేటాయిస్తారు. అభ్యర్థి ఎంచుకున్న ఆసుపత్రికి వివరాలు పంపిస్తారు. అక్కడికి వెళ్లి తీసుకోవచ్చు. డిసెంబరు 25 వరకు ప్రభుత్వం అవకాశం ఇచ్చింది'

నాన్‌అమృత్‌పై ఆశలు!


పాలకొండ పట్టణంలో నిరుపయోగంగా విలువైన పైపులు

పాలకొండ, న్యూస్‌టుడే: పట్టణాల్లో తాగునీటి సమస్య పరిష్కారం కానుంది. నాన్‌అమృత్ పథకాన్ని పూర్తిచేసేందుకు కూటమి ప్రభుత్వం గడువు పెంచింది. గతంలో తెదేపా హయాంలో 2018లో దీనిని మంజూరు చేశారు. అనంతరం అధికారంలోకి వచ్చిన వైకాపా గాలికొదిలేసింది. రూ.10 కోట్ల మేర బిల్లులు పేరుకుపోవడంతో గుత్తేదారు మధ్యలోనే వదిలేశారు.

అయిదేళ్లుగా పాట్లు..: పాలకొండ పట్టణంలో 65 కి.మీ. మేర పైపులైన్లు వేయాలి. రక్షిత పథకాలకు నాగావళి నదీ తీరం నుంచి 3 కి.మీ. మేర ప్రధాన లైన్లు ఏర్పాటు చేయాలి. 2022 డిసెంబరు నెలలో ఈ ప్రక్రియ ప్రారంభమైంది. మూడు నెలల్లో 5.6 కి.మీ మేర పనులు చేసి. వదిలేశారు. ఈక్రమంలో తాగునీరు అందక గారమ్మకాలనీ, ఎన్ఎస్ఎన్‌కాలనీ, నీలమ్మకాలనీ, గాయత్రీనగర్, ఎంఎంనగర్ తదితర ప్రాంతాల వారు అవస్థలు పడుతున్నారు.

మరో అవకాశం..

పథకం కింద పార్వతీపురం(రూ.63.63 కోట్లు), సాలూరు(రూ.68.68 కోట్లు), పాలకొండ(రూ.57 కోట్లు)లో తాగునీటి సరఫరా పనులకు రూ.189.31 కోట్లు మంజూరు చేశారు. కానీ ఎక్కడా పూర్తికాలేదు. గత పాలకులు కనీసం దృష్టిసారించలేదు. ప్రాజెక్టు గడువు ఈ ఏడాది జూన్ 30తో ముగిసింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం మరో అవకాశం ఇచ్చింది.

తప్పని ఎదురుచూపులు

పార్వతీపురంలో 36 కి.మీ. మేర పైపులైన్లు వేయాలి. ఇప్పటి వరకు 200 మీటర్లు వేశారు. పట్టణంలో 62 వేల మందికి 5 పథకాలున్నా పూర్తిస్థాయిలో నీరందని పరిస్థితి. బెలగాం, సాయిరాంకాలనీ, బంగారమ్మకాలనీ, రిక్షాకార్మికుల కాలనీ, రాజీవ్‌కొత్తపోలమ్మకాలనీ, బైపాస్‌కాలనీలో ఇబ్బందులున్నాయి. ◆ సాలూరులో రూ.3.50 కోట్ల విలువైన సామగ్రిని సిద్ధం చేశారు. శిలాఫలకం సైతం వేశారు. కానీ పనులు ప్రారంభం కాలేదు. 55 వేల మందికి ఒక్క రక్షిత పథకమే దిక్కవుతోంది. నాలుగేళ్ల పాటు గడువు పెంచుతూ ఆదేశాలు వచ్చాయని, త్వరితగతిన పూర్తిచేస్తామని డీఈ నర్సింగరావు 'న్యూస్‌టుడే'కు తెలిపారు.

గుంతలు దాటితేనే గమ్యం చేరేది

పార్వతీపురం నుంచి కూనేరు వెళ్లే మార్గం అధ్వానంగా దర్శనమిస్తోంది. ఆంధ్ర- ఒడిశా సరిహద్దుల్లోని గుమడ, కూనేరు వద్ద భారీ గోతులు ఏర్పడటంతో వాహనాలు కూరుకుపోతున్నాయి. శనివారం గుమడ వద్ద కర్రల లోడుతో వెళ్తున్న లారీ బురదలో ఆగిపోయింది. దీంతో గంటల కొద్దీ రాకపోకలకు అంతరాయం కలగడంతో కొమరాడ పోలీసులు చేరుకొని రెండు పొక్లెయిన్లతో లారీని పక్కకు తీయించారు. కూనేరు వద్ద ఒడిశా వెళ్తున్న మరో లారీ సైతం కూరుకుపోయింది.

– న్యూస్‌టుడే, కొమరాడ



పార్వతీపురంలో భారీ వర్షం


చెరువును తలపిస్తున్న పాతబస్టాండ్ కూడలి

పార్వతీపురం జిల్లా కేంద్రంలో శనివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. దీంతో పాతబస్టాండ్ కూడలి, కుమ్మరివీధి, సారికవీధి తదితర ప్రాంతాల్లో పెద్దఎత్తున నీరు చేరింది. వీధుల్లోని కాలువలన్నీ పొంగిపొర్లడంతో మురుగు రోడ్డెక్కింది.

– న్యూస్‌టుడే, పార్వతీపురం పురపాలిక


పుర వీధుల్లో ప్రవహిస్తున్న నీరు

భక్తిశ్రద్ధలతో సిరిమాను తరలింపు


చదురుగుడి నుంచి తీసుకెళ్తున్న భక్తులు

తెప్పోత్సవానికి రేపు ప్రాథమిక పరిశీలన

కంటోన్మెంట్, న్యూస్‌టుడే: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు పైడితల్లి సిరిమానోత్సవం అనంతరం చదురుగుడి ఆలయం వద్ద భక్తుల దర్శనార్థం ఉంచిన సిరిమానును శనివారం కొత్తపేట తరలించారు. ఉదయం 6.30 గంటలకు ప్రత్యేక పూజల అనంతరం దీక్షాధారులు తల్లి శరణఘోష నడుమ ఈ కార్యక్రమాన్ని సంప్రదాయంగా చేపట్టారు. శివాలయం వీధి, పార్కుగేటు, మండపం, సుద్దవీధి మీదుగా తీసుకెళ్లి.. కొత్తపేట మండపం సమీపంలోని రాజ్‌గోపాల్ పెండ్రిస్‌లో విడిచిపెట్టారు. మంగళవారం పెద్ద చెరువులో తెప్పోత్సవం జరగనుంది. శనివారం జేసీబీ సాయంతో చెరువులోకి తెప్పను దించారు. సోమవారం ప్రాథమిక పరిశీలన జరగనుంది.

అభ్యంతరాలుంటే మరోసారి సర్వే

పార్వతీపురం, న్యూస్‌టుడే: రీసర్వే పూర్తయిన ప్రాంతాల్లో ముందుగా నిర్ణయించిన ప్రకారం గ్రామ సభలు నిర్వహించాలని జేసీ శోభిక ఆదేశించారు. శనివారం పార్వతీపురంలో డివిజన్ పరిధిలోని తహసీల్దార్లు, ఉప తహసీల్దార్లతో సమావేశం నిర్వహించారు. గ్రామసభలపై రైతులకు ముందుగా సమాచారం ఇవ్వాలన్నారు. వారి నుంచి వచ్చే ఫిర్యాదులు, అభ్యంతరాలను కచ్చితంగా నమోదు చేయాలన్నారు. అన్ని స్థాయిల్లో వాటిని పరిశీలించి నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందన్నారు. అభ్యంతరాలు ఉంటే మరోసారి సర్వే చేపట్టాలని సూచించారు. పార్వతీపురం సబ్‌కలెక్టరు అశుతోష్ శ్రీవాస్తవ, సర్వే విభాగం అధికారులు పాల్గొన్నారు.


దస్త్రాలు పరిశీలిస్తున్న జేసీ శోభిక, సబ్‌కలెక్టరు అశుతోష్

పార్వతీపురం పట్టణం, సీతానగరం, న్యూస్‌టుడే:

విద్యార్థి భవిష్యత్తుకు పునాది వేసే ప్రాథమిక పాఠశాలలకు పూర్వ కళ రానుంది. గత వైకాపా ప్రభుత్వం జీవో 117 తీసుకొచ్చి పాఠశాలలను విలీనం చేయడంతో విద్యా వ్యవస్థ అస్తవ్యస్తమైంది. చాలా పాఠశాలలు బోసిపోయాయి. ఈ నేపథ్యంలో ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు జీవోను రద్దు చేయడంతో ఉపాధ్యాయ సంఘాలు, విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పాఠశాలకు పూర్వ కళ

జిల్లాలో వివరాలు..

- మండలాలు: 15
- పాఠశాలలు: 1,487
- ప్రాథమిక: 1,292
- ప్రాథమికోన్నత: 95
- ఉన్నత: 100
- విలీనమైనవి: 129

ఇది సీతానగరం మండలంలోని నిడగల్లు పాఠశాల. గతంలో అయిదు తరగతులు ఉన్నప్పుడు 50 మంది వరకు విద్యార్థులుండేవారు. విలీనం తర్వాత 1, 2 తరగతులకు చెందిన 12 మంది మాత్రమే మిగిలారు. ముగ్గురు ఉపాధ్యాయుల్లో ఒకరిని ఉన్నత పాఠశాలకు పంపించారు. కొన్ని గదులు వృథాగా మారాయి.



వేలల్లో తగ్గిన విద్యార్థులు..

జిల్లాలో గతంలో 1,421 ప్రాథమిక పాఠశాలలు ఉండగా విలీనంతో 129 ఉన్నత పాఠశాలల్లో కలిసిపోయాయి. మిగిలిన 1,292 పాఠశాలల్లో చాలా చోట్ల 1, 2 తరగతులు మాత్రమే నడిచాయి. 3, 4, 5 తరగతులు విలీనమైన చోట్ల సరిపడా గదులు, ఉపాధ్యాయులు లేక విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. విద్యార్థులను దూరంగా ఉండే పాఠశాలలకు పంపించడం ఇష్టం లేని తల్లిదండ్రులు ప్రైవేటు వైపు మొగ్గు చూపారు. గతంలో జిల్లా వ్యాప్తంగా 87 వేల మందికి పైగా విద్యార్థులు ఉండగా విలీనం తర్వాత 66 వేలకు తగ్గిపోయారు.

గాడిలోకి తెచ్చే ప్రయత్నం..

విలీన ప్రక్రియతో ప్రభుత్వ బడుల్లో ప్రవేశాలు మందగించడం, విద్యా వ్యవస్థ నాశనం కావడంతో ఉపాధ్యాయ సంఘాలు ఆందోళన చేపట్టాయి. అయినప్పటికీ వైకాపా ప్రభుత్వం ఎలాంటి చర్యలు చేపట్టలేదు. గత ఎన్నికల సమయంలో విద్యా శాఖ మంత్రి లోకేశ్ పాదయాత్ర చేయగా ఎక్కువగా జీవో 117కు సంబంధించిన వినతులే అందాయి. ఈ నేపథ్యంలో ప్రాథమిక విద్యను దెబ్బతీసే జీవో రద్దు చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. గాడి తప్పిన వ్యవస్థను సరైన మార్గంలోకి తీసుకొచ్చేందుకు చర్యలు చేపట్టింది.

తరగతికో ఉపాధ్యాయుడు ఉండాలి..

ప్రాథమిక విద్యా వ్యవస్థకు విఘాతం కలిగించే జీవో 117ను ప్రభుత్వం రద్దు చేయడం గొప్ప విషయం. ఈ నిర్ణయంతో ప్రభుత్వ విద్య పూర్వ వైభవాన్ని సంతరించుకోనుంది. విద్యార్థుల సంఖ్యతో సంబంధం లేకుండా తరగతికి ఒక ఉపాధ్యాయుడిని నియమించాలి.

- ఎ.సూర్యనారాయణ, పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు

ప్రభుత్వ నిర్ణయం ప్రకారం..

వచ్చే ఏడాది నుంచి జీవో 117 రద్దు అమల్లోకి రానుంది. సంబంధిత ఆదేశాలు వస్తే ప్రభుత్వ నిర్ణయం మేరకు పాఠశాలల నిర్వహణ చేపడతాం. విలీన ప్రక్రియ రద్దయితే 3, 4, 5 తరగతులు పూర్వ బడులకు వెళ్తాయి.

- పగడాలమ్మ, డీఈవో, పార్వతీపురం

న్యూస్‌టుడే, విజయనగరం వైద్య విభాగం

నిరుపేద, మధ్యతరగతి ప్రజలకు అత్యవసర సమయంలో రక్తం అవసరమైతే మేమున్నామంటూ ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ముందుకు వస్తోంది. ఇప్పటి వరకు లక్షలాది మందికి సేవలు అందించింది. అయితే ప్రస్తుత అవసరాలు, రక్త వినియోగం నేపథ్యంలో అత్యాధునిక సేవలను అందుబాటులోకి తేవాలని భావిస్తోంది. ఈమేరకు రూ.కోట్ల విలువైన పరికరాలను సమకూర్చుకుంది. అయితే కేంద్రం నుంచి అనుమతులు రాకపోవడంతో బ్లడ్ కాంపొనెంట్ యూనిట్, సింగిల్ ప్లేట్ డోనార్ యూనిట్లు ప్రారంభానికి నోచుకోవడం లేదు.

అత్యాధునికం.. అనుమతులే జాప్యం

ఉమ్మడి జిల్లాలో ధరలు ఇలా..(రూ.లలో)

అంశం	రెడ్‌క్రాస్	ప్రైవేటు
హోల్ బ్లడ్	800	1,200- 1,450
ప్యాకెట్ సెల్స్	-	1,200- 1,450
ప్లాస్మా	-	600- 1,000
ప్లేట్‌లెట్లు	-	1,000- 1,450
సింగిల్ డోనార్	-	12,000- 14,000

మార్పులు ఇలా..

ప్రస్తుతం హోల్ బ్లడ్(రోగికి అవసరమైన రక్తాన్ని ప్యాకెట్ల రూపంలో అందించడం) సేవల్లో సొసైటీ ముందుంది. అయితే కొన్నిసార్లు గ్రూపుల్లో తేడాలు వచ్చాయన్న ఆరోపణలున్నాయి. ప్రైవేటు కేంద్రాలపైనా ఇలాంటి ఫిర్యాదులే వస్తున్నాయి. ఈ నేపథ్యంలో కొత్త యూనిట్లను ప్రారంభించనుంది. అందులో భాగంగా రెండేళ్ల కిందటే విలువైన పరికరాలు వచ్చాయి. కేంద్ర ఔషధ నియంత్రణ సంస్థ తనిఖీలు చేసి, సంతృప్తి సైతం వ్యక్తం చేసింది. అయితే ఇంతవరకు అనుమతులు రాలేదు.


అందుబాటులో రూ.కోట్ల విలువైన పరికరాలు

ఉపయోగాలివీ..

మనిషి నుంచి సేకరించిన ఒక యూనిట్ రక్తం అనేక రకాల సేవలకు ఉపయోగపడుతుంది. హోల్ బ్లడ్, ప్యాకెట్ సెల్స్, ప్లాస్మా, ప్లేట్‌లెట్లు, సింగిల్ డోనార్ ప్లేట్‌లెట్లు.. తదితర విధాలుగా వినియోగించవచ్చు.

- ★ రోడ్డు ప్రమాద బాధితులు, గర్భిణులు, బాలింతలు, శస్త్రచికిత్సల సమయంలో హోల్ బ్లడ్‌ను ఉపయోగిస్తారు.
- ★ రోగి వేగంగా కోలుకునేందుకు ప్యాకెట్ సెల్స్ అవసరం.
- ★ అరుదైన సమయాల్లో ప్లాస్మా వాడతారు.
- ★ డెంగీ బాధితులకు ప్లేట్‌లెట్లు, ఎక్కిస్తారు.
- ★ అత్యవసర వేళల్లో సింగిల్ డోనార్ ప్లేట్‌లెట్లు వినియోగిస్తారు.
- ★ కొత్త యూనిట్లు అందుబాటులోకి వస్తే ఈ సేవలన్నీ అందనున్నాయని, ఎలాంటి ప్రమాదం ఉండదని నిపుణులు చెబుతున్నారు. అలాగే తక్కువ ధరలకే సేవలను అందించవచ్చని పేర్కొంటున్నారు.

వారికి ఉచిత సేవలు..

2006 నుంచి 2023 డిసెంబరు నెలాఖరు వరకు 57,718 యూనిట్లు సేకరించాం. ఇందులో 30 శాతం ప్రభుత్వ ఆసుపత్రులకు ఇచ్చాం. క్యాన్సర్, తలసేమియా, సికిల్ సెల్ రోగులతో పాటు గిరిజనులు, నిరుపేద వర్గాల వారికి ఉచితంగా అందిస్తున్నాం. బ్లడ్ కాంపొనెంట్, సింగిల్ ప్లేట్ డోనార్ యూనిట్లు ప్రారంభమైతే సేవలు మరింత మెరుగుపడనున్నాయి. చీపురుపల్లిలోనూ బ్లడ్ బ్యాంక్‌ను అందుబాటులోకి తెస్తున్నాం. - ప్రసాదరావు, ఛైర్మన్, కె.సత్యం, కార్యదర్శి, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ





పూజలందుకుంటున్న స్వామివారు

16 వేల తమలపాకులతో అర్చన

గరుగుబిల్లి, న్యూస్‌టుడే: గరుగుబిల్లిలోని షిర్డీ సాయి ఆలయంలో ఆంజనేయ స్వామికి తమలపాకుల అర్చన నిర్వహించారు. 38 మంది దంపతులు పాల్గొని 16 వేల తమలపాకులతో ఎన్.ప్రసాదశర్మ, ఎస్.నరసింహమూర్తులు, జి.రఘునాథశర్మ ఆధ్వర్యంలో పూజలు చేశారు. 600 చొప్పున నేతి గారెలు, గుమ్మడి అప్పాలు, నిమ్మకాయలను నైవేద్యంగా సమర్పించారు. శ్రీకాకుళం, రాయగడ, పాలకొండ, పార్వతీపురం, విజయనగరం నుంచి భక్తులు పాల్గొన్నారు. వీరముష్టుల చెందిన శతాధి దేవాలయాల ప్రతిష్ఠాపకుడు ఎస్వీఎల్ఎన్.శర్మయాజి పర్యవేక్షించారు.

న్యూస్‌టుడే – రాజాం

నైపుణ్యం పట్టు.. ఉపాధికి మెట్టు

వరంగా పీఎం ఇంటర్న్‌షిప్ పథకం

దరఖాస్తులకు ఈనెల 25 వరకు గడువు

ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు నైపుణ్యం అత్యంత కీలకం. ప్రముఖ కంపెనీల్లో ఇంటర్న్‌షిప్ చేసిన వారికి ఉద్యోగాల కల్పనలో ప్రాధాన్యత ఇస్తున్నారు. ఇప్పటికే చదువులు పూర్తిచేసుకుని ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు దూరంగా ఉన్న యువతకు కేంద్రం ఊపిరిలూదింది. 'ప్రధాన మంత్రి ఇంటర్న్‌షిప్' పథకం కింద అభ్యర్థులను ఎంపిక చేస్తోంది. దీనికి సంబంధించి ఆన్‌లైన్ పోర్టల్‌లో దరఖాస్తులు చేసుకునేందుకు ఈ నెల 12 నుంచి అవకాశం కల్పించింది. దేశంలోని 500 అగ్రగామి కంపెనీల్లో 12 నెలల పాటు నైపుణ్యాలను అందిపుచ్చుకునేందుకు వీలుగా ఏర్పాట్లు చేసింది. గతంలో కంపెనీల్లో ఇంటర్న్‌షిప్‌లో కాకుండా నియామకాలు 10 శాతం వరకూ ఉండగా.. ఇప్పుడు 60 - 70 శాతానికి పైగా ఇదే విధానాన్ని అనుసరిస్తున్నాయి. మరికొన్ని ఇంజినీరింగ్ నాలుగో ఏడాది చదివే సమయంలోనే శిక్షణను పూర్తి చేయిస్తున్నాయి. జిల్లాలో ఏటా ఐటీఐ, డిగ్రీ, డిప్లొమా ఇతర డిగ్రీలు పూర్తిచేస్తున్న వారు 20 వేల మందికి పైగా ఉంటున్నారు.

21 - 24 ఏళ్ల వారు అర్హులు

ఇంటర్న్‌షిప్‌నకు దరఖాస్తు చేసుకునేందుకు 21-24 ఏళ్ల యువత అర్హులు. కుటుంబంలో ఏ ఒక్కరి ఆదాయం రూ.8 లక్షలు దాటినా అనర్హులే. సీఏ, ఎంబీబీఎస్, ఎంబీఏ వంటి ఉన్నత డిగ్రీలతో పాటు ఐఐటీ, ఐఐఎం, ఐఐటీ తదితర ఉన్నత విద్యా సంస్థల్లో చదివిన వారు దరఖాస్తు చేసుకోవడానికి అనర్హులు.

ఏడాదిలో రూ.66 వేలు..

ఇంటర్న్‌షిప్‌నకు ఎంపికైన అభ్యర్థులకు ప్రతి నెలా రూ.5 వేల చొప్పున అందిస్తారు. ఏక కాల గ్రాంటు కింద మరో రూ.6 వేలు కూడా ఇస్తారు. మొత్తంగా ఏడాదిలో రూ.66 వేలు సమకూరుతుంది. www.pminternship.mca.gov.in అనే ఆన్‌లైన్ పోర్టల్‌లో అభ్యర్థులు దరఖాస్తు చేయాలి. ఆధార్‌తో అనుసంధానమైన చరవాణి నంబరు, బయోడేటా తప్పనిసరి. చిరునామా, వ్యక్తిగత వివరాలు, ఈ మెయిల్‌ఐడీ, విద్యార్హతలు, బ్యాంకు ఖాతా వివరాలు తదితర వాటిని పొందుపర్చాలి. ఈ నెల 25వ తేదీలోగా దరఖాస్తులు చేసుకోవాలి. 26న జాబితా ప్రకటిస్తారు. 27 నుంచి నవంబరు 7 వరకూ ఎంపిక ప్రక్రియ కొనసాగుతుంది. ఎంపికైన అభ్యర్థులు 8- 15 లోగా అంగీకారం తెలపాలి. ఇంటర్న్‌షిప్‌లు డిసెంబరు 2న ప్రారంభమవుతాయి.

కోటదుర్గమ్మ హుండీ ఆదాయం రూ.13.74 లక్షలు

పాలకొండ, న్యూస్‌టుడే: దసరా ఉత్సవాల్లో భాగంగా భక్తులు కోటదుర్గమ్మకు సమర్పించిన కానుకలను శనివారం పోలీసుల సమక్షంలో హుండీలను తెరిచి లెక్కించారు. రూ.13,74,102 నగదు, 11.5 గ్రాముల బంగారం, 470 గ్రాముల వెండి లభించింది. ఆలయ తనిఖీదారు ఎస్.రామారావు, కార్యనిర్వహణాధికారి సూర్యనారాయణ, ప్రధానార్చకులు బుజ్జిబాబు పర్యవేక్షణలో లెక్కింపు కార్యక్రమం సాయంత్రం వరకు జరిగింది.



కానుకలు లెక్కిస్తున్న సిబ్బంది

పైడితల్లి అన్నదానానికి విరాళం



ఉత్తరాంధ్ర కల్పవల్లి పైడితల్లి అమ్మవారి అన్నదానానికి విజయనగరానికి చెందిన విశ్వేశ్వరరావు రూ.లక్ష విరాళం అందజేశారు. స్థానిక చదురుగుడిలో దేవస్థానం సీనియర్ అసిస్టెంట్ ఏడుకొండలుకు చెక్కు రూపంలో ఈ మొత్తాన్ని అందించారు. ఈ సందర్భంగా దాతకు తల్లి సన్నిధిలో ప్రత్యేక పూజలు జరిపారు.

– న్యూస్‌టుడే, కంటోన్మెంట్

50 వేల సభ్యత్వ నమోదే లక్ష్యం



మాట్లాడుతున్న మంత్రి సంధ్యారాణి

సాలూరు గ్రామీణం, న్యూస్‌టుడే: నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేస్తూ సాలూరును అభివృద్ధి బాటలో నడిపించాలని మంత్రి సంధ్యారాణి తెలిపారు. శనివారం పట్టణంలోని పార్టీ క్యాంపు కార్యాలయంలో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. 26 నుంచి పార్టీ సభ్యత్వ నమోదు ప్రక్రియను చేపడుతున్నట్లు ఆమె వివరించారు. 50 వేల సభ్యత్వ నమోదు లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఆర్‌పీ భంజ్‌దేవ్, పార్టీ అధ్యక్షుడు చిట్టి, పరమేశ్, వేణు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలు నెరవేర్చాలి

పార్వతీపురం, న్యూస్‌టుడే: గిరిజనులకు ప్రత్యేక ఉద్యోగ నియామక ప్రక్రియ నిర్వహిస్తామని కూటమి నాయకులు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ నెరవేర్చాలని ఏజెన్సీ ఐకాస నాయకులు డిమాండు చేశారు. నాయకులు ధర్మారావు, నీలకంఠం, జయరాజు ఆధ్వర్యంలో శనివారం పార్వతీపురం గిరిజన భవన్‌లో సమావేశం నిర్వహించారు. షెడ్యూల్డు గ్రామాల్లో పీసా చట్టం అమలులో భాగంగా గ్రామ సభలు నిర్వహించాలని కోరారు. అన్ని మండలాల గిరిజన నాయకులు హాజరయ్యారు.

21 నుంచి ఇంటర్ పరీక్షలకు రుసుము చెల్లింపు

విజయనగరం విద్యావిభాగం, న్యూస్‌టుడే: ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలకు హాజరుకానున్న ప్రథమ, ద్వితీయ సంవత్సరం రెగ్యులర్, ప్రైవేటు, హాజరు మినహాయింపు పొందిన విద్యార్థులు 21వ తేదీ నుంచి నవంబరు 11లోగా కళాశాలలో ఫీజు చెల్లించాలని ఇంటర్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి ఎం.ఆదినారాయణ ఓ ప్రకటనలో తెలిపారు. రూ.1000 అపరాధ రుసుముతో చెల్లించేందుకు నవంబరు 20 వరకు అవకాశముందని పేర్కొన్నారు. ఆర్ట్స్, హ్యూమానిటీస్ అభ్యర్థులు https://biev2.apcfss.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకుని, నవంబరు 15లోగా హాజరు మినహాయింపు కోసం రూ.1500 ఫీజు చెల్లించాలని తెలిపారు. ఇతర వివరాలకు కళాశాల ప్రధానాచార్యులను సంప్రదించాలని కోరారు.



రాష్ట్ర పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

ఉత్సాహంగా క్రికెట్, హాకీ, త్రోబాల్ ఎంపికలు

విజయనగరం క్రీడలు, న్యూస్‌టుడే: విజయనగరంలోని విజ్జీ మైదానంలో శనివారం క్రికెట్, హాకీ జట్ల ఎంపికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించారు. అండర్-17 బాలబాలికల క్రికెట్ జట్ల ఎంపికలకు 150 మంది క్రీడాకారులు తరలివచ్చారు. వీరిలో అత్యుత్తమ ప్రతిభ చూపిన 16 మంది రాష్ట్రస్థాయికి అర్హత సాధించారని స్కూల్ గేమ్స్-17 కార్యదర్శి కృష్ణంరాజు తెలిపారు. ఈ సందర్భంగా వీరిని ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ అభినందించారు. ఇదే మైదానంలో హాకీ, త్రోబాల్ ఎంపికలు జరిగాయి. హాకీకి 100 మంది, త్రోబాల్‌కు 210 మంది తరలివచ్చారు. వీరిలో బాగా రాణించిన వారిని రాష్ట్ర జట్లకు ఎంపిక చేసినట్లు కృష్ణంరాజు వెల్లడించారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

విజయనగరం అయ్యన్నపేట, న్యూస్‌టుడే: రెడాక్స్ ల్యాబొరేటరీస్ ఇండియా ప్రై.లిమిటెడ్, స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్, విశాఖపట్నం ఆధ్వర్యంలో వివిధ రంగాల్లో ఉచిత శిక్షణతో పాటు ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్లు రెడాక్స్ ల్యాబొరేటరీస్ ఇండియా ఎండీ పి.దుర్గాప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు. విజయనగరంలోని మహారాజా డిగ్రీ కళాశాలలో ఈనెల 22న పురుష అభ్యర్థులకు ముఖాముఖి నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. 18 నుంచి 25 లోపు వయసు, బీఎస్సీ (కెమిస్ట్రీ), డిప్లొమా(ఈఈఈ, ఈసీఈ, మెకానిక్), ఐటీఐ విద్యార్హత ఉండాలన్నారు. 2020- 2024 విద్యా సంవత్సరాల్లో ఉత్తీర్ణత సాధించినవారు అర్హులని పేర్కొన్నారు. శిక్షణ సమయంలో ఉచిత వసతి, భోజన సదుపాయం కల్పిస్తున్నట్లు వివరించారు. ఇతర వివరాలకు 70939 47321 నంబరును సంప్రదించాలని సూచించారు.

కడుపునొప్పి తాళలేక ఇంటిపెద్ద ఆత్మహత్య

విజయనగరం నేరవార్తా విభాగం, న్యూస్‌టుడే: కడుపునొప్పి తాళలేక నేలబావిలో దూకి ఆత్మహత్య చేసుకున్న ఘటన వీటీ అగ్రహారం మధ్యపేటలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. వంట మనిషిగా చేసే జోగా జగన్నాథం(35) కొన్నాళ్లుగా కడుపు నొప్పితో బాధపడుతున్నారు. చికిత్స కూడా పొందుతున్నారు. ఎంతకీ సమస్య పరిష్కారం కాకపోవడంతో శనివారం ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఆయన సమీపంలోని నేలబావిలో శవమై తేలాడు. ఆయనకు భార్య, ముగ్గురు పిల్లలున్నారు. భార్య రేవతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు గ్రామీణ ఎస్‌ఐ రేవతి తెలిపారు.

విద్యుదాఘాతంతో ఎలక్ట్రీషియన్ మృత్యువాత

విజయనగరం నేరవార్తా విభాగం, న్యూస్‌టుడే: విద్యుదాఘాతంతో ఎలక్ట్రీషియన్ మృతి చెందిన ఘటన శనివారం కాళీఘాట్ కాలనీలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. విశాఖపట్నం జిల్లా ఆనందపురం ప్రాంతానికి చెందిన ఎన్.వెంకటరమణ (33) విద్యుత్తు పనుల నిమిత్తం ఓ ఇంటికి వచ్చారు. నిచ్చెన ఒకవైపు నుంచి మరో దగ్గరికి తీసుకొని వెళ్తుండగా 11 కేవీ విద్యుత్తు తీగలు తగిలి వెంకటరమణ అక్కడికక్కడే చనిపోయారు. అతని వెంట వచ్చిన బి.సూర్యారావు గాయపడ్డారు. ఆయన భార్య అమృత సుష్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఒకటో పట్టణ ఎస్‌ఐ ప్రశాంత్‌కుమార్ తెలిపారు.

బస్సు, ఆటో ఢీ: నలుగురికి గాయాలు



చికిత్స పొందుతున్న విద్యార్థినులు

కొమరాడ, న్యూస్‌టుడే: ప్రైవేటు పాఠశాల బస్సు, ఆటో ఢీకొన్న ఘటనలో ముగ్గురు విద్యార్థులు తీవ్రంగా గాయపడ్డారు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. పార్వతీపురం నుంచి ప్రైవేటు పాఠశాల బస్సు, విద్యార్థులతో జట్టు ఆశ్రమానికి వెళ్తున్న ఆటో విక్రాంపురంలో ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఆటోలో ఉన్న పది, తొమ్మిదో తరగతులు చదువుతున్న దీవెన, గీతాంజలి, చందు, చోదకుడు మహేశ్‌కు గాయాలయ్యాయి. స్థానికులు గమనించి పార్వతీపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి ఇద్దరిని విశాఖ తీసుకెళ్లారు. జట్టు ఆశ్రమ నిర్వాహకురాలు పద్మజ ఆసుపత్రికి వెళ్లి విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. ఈ ఘటనలో బస్సులో ఉన్న విద్యార్థులు భయాందోళనకు గురయ్యారు. వారెవరికీ ఎలాంటి గాయాలూ కాకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. కొమరాడ ఏఎస్‌ఐ ఎల్.ఆర్.నాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికెన్ ధరలు

రకం	(బ్యాగ్)లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
బ్రాయిలర్	137	244	254

షోకాజ్ నోటీసుల జారీ

సీతంపేట, న్యూస్‌టుడే: శ్రీకాకుళం జిల్లా పాతపట్నం కేంద్రంగా కొనసాగుతున్న మెళియాపుట్టి ఏకలవ్య పాఠశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ కృష్ణవేణి, వార్డెన్ నాగేశ్వరీలకు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు ఐటీడీఏ పీవో సి.యశ్వంత్ కుమార్ రెడ్డి తెలిపారు. ఈ పాఠశాలలో చదువుతున్న సీతంపేట మండలం వంబరెల్లికి చెందిన విద్యార్థిని ఎస్.లావణ్య ఇటీవల మృతి చెందగా.. ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్, వార్డెన్‌లు స్పందించపోవడం, అలసత్వం వహించడం వంటి కారణాలపై చర్యలు తీసుకున్నామన్నారు. శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు టెక్కలి ఆర్డీవోను విచారణ అధికారిగా నియమించామన్నారు.

జీఎస్‌టీ అధికారులంటూ అక్రమ వసూళ్లు!



వివరాలు సేకరిస్తున్న పోలీసులు

మక్కువ, న్యూస్‌టుడే: మక్కువ మండలంలో జీఎస్టీ అధికారులమంటూ ఓ నకిలీ ముఠా వ్యాపారుల నుంచి సొమ్ము వసూలు చేస్తుండగా శనివారం పోలీసులకు చిక్కింది. కిరాణా, బంగారు, సిమెంటు పలు వ్యాపారుల వద్దకు వెళ్లి లోపాలు చూపించి జి.దాలయ్య, చల్లయ్య ఇద్దరు వ్యక్తులు డబ్బులు డిమాండు చేశారు. కొంతమంది నుంచి వసూలు చేస్తుండగా.. మరికొంతమంది అడ్డు చెప్పడంతో ఇరువురు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఈక్రమంలో అక్కడికి చేరుకున్న పోలీసులు విషయంపై ఆరా తీయగా.. అనుమానమొచ్చి స్టేషన్‌కు తరలించారు. అనంతరం సాలూరు సీఐ పి.రామకృష్ణ దృష్టికి తీసుకెళ్లారు.

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM TO 1 PM)

పార్వతీపురం - 8008566244
పాలకొండ - 8008574299
సాలూరు - 8008786820
కురుపాం - 9849044696

?: వెంగళరాయపురం ప్రాథమిక పాఠశాలలోని బోరు పాడైంది. - **తల్లిదండ్రులు**
★ పరిశీలించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. - **ఎస్.సింహాచలం, ఎంఈవో**
- న్యూస్‌టుడే, బలిజిపేట

?: సీతానగరం హనుమాన్ కూడలి నుంచి ప్రధాన వీధికి వచ్చే మార్గంలో కొన్ని చోట్ల వీధి దీపాలు వెలగడం లేదు. రాత్రి వేళ ఇబ్బంది పడుతున్నాం. - **రామకృష్ణ**
★ పరిశీలించి కొత్త దీపాలు ఏర్పాటు చేస్తాం. - **రమేష్, ఈవో, పెదభోగిల**
- న్యూస్‌టుడే, సీతానగరం

?: గుమడ రైల్వే స్టేషన్‌కు వెళ్లే రోడ్డు దెబ్బతింది. రాకపోకలకు ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. - **శ్రీను, గుమడ**
★ రైల్వే శాఖతో చర్చించి గుమడ రైల్వే స్టేషన్ రోడ్డుకు పనులు చేయిస్తాం. - **మల్లికార్జునరావు, ఎంపీడీవో**
- న్యూస్‌టుడే, కొమరాడ

?: అడ్డాపువలస మధ్య వీధిలో కాలువ నీరు వెళ్లక రహదారిపై పారుతోంది. పిల్లలు, వృద్ధులు జారి పడుతున్నారు. - **స్థానికులు**
★ పరిశీలించి కాలువలు శుభ్రం చేయిస్తాం. - **జీవీఆర్.మూర్తి, ఈవోపీఆర్డీ**
- న్యూస్‌టుడే, పార్వతీపురం గ్రామీణం

?: కురుపాంలో దోమలు విజృంభిస్తున్నాయి. నివారణ చర్యలు చేపట్టాలి. - **మిన్నారావు**
★ కాలువల్లో దోమల నివారణ మందు పిచికారీ చేయిస్తాం. - **చంద్రశేఖర్, పంచాయతీ కార్యదర్శి** - న్యూస్‌టుడే, కురుపాం గ్రామీణం

?: పాలకొండ ఇందిరానగర్ కాలనీలో బోరు చుట్టూ పిచ్చిమొక్కలు పెరిగాయి. - **రాజు**
★ పిచ్చిమొక్కలు తొలగించి శుభ్రం చేయిస్తాం. - **ఎస్.సర్వేశ్వరరావు, కమిషనరు**
- న్యూస్‌టుడే, పాలకొండ గ్రామీణం

?: మండలంలోని పలు గ్రామాలకు విద్యుత్తు శాఖ అధికారులు సమాచారం లేకుండా గంటల తరబడి కోతలు విధిస్తున్నారు. - **గ్రామస్థులు**
★ డివిజన్ స్థాయిలో సమస్యలు ఉన్నప్పుడు సమస్య తలెత్తుతోంది. - **శ్రీనివాసరావు, విద్యుత్తు శాఖ ఏఈ** - న్యూస్‌టుడే, భామిని

మహిళా ఉద్యోగులకు అండగా వికాసం


రాష్ట్ర, జిల్లా నాయకులతో మహిళా విభాగం సభ్యులు

పార్వతీపురం, న్యూస్‌టుడే: ఏపీ వికాస అమరావతిని బలోపేతం చేసేందుకు మహిళా విభాగాలు ఏర్పాటు చేసినట్లు రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు పి.లక్ష్మి అన్నారు. శనివారం పార్వతీపురంలో జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు సుష్మాపట్నాయక్ అధ్యక్షతన కార్యవర్గ సమావేశం నిర్వహించారు. అన్ని స్థాయిల్లో మహిళా ఉద్యోగుల విభాగాలు బలోపేతం చేయనున్నట్లు లక్ష్మి తెలియజేశారు. ఈ సందర్భంగా వ్యక్తిగత కారణాలతో సుష్మాపట్నాయక్ రాజీనామా చేయగా పార్వతీపురం తహసీల్దారు కార్యాలయం సీనియర్ సహాయకురాలు అరుణను ఏకగ్రీవంగా అధ్యక్షురాలిగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లా వికాస అధ్యక్షుడు జి.శ్రీరామ్మూర్తి, రాష్ట్ర మహిళా విభాగం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

శ్మశానవాటిక అభివృద్ధికి కృషి


ఎమ్మెల్యే జయకృష్ణకు సమస్యలు చెబుతున్న నాయకులు

పాలకొండ గ్రామీణం, న్యూస్‌టుడే: పాలకొండ పట్టణంలో ప్రధానమైన గజాలఖానా వద్ద ఉన్న రుద్రభూమి అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే జయకృష్ణ పేర్కొన్నారు. శనివారం కూటమి నాయకులతో కలిసి రుద్రభూమిని సందర్శించారు. కాశీవీధులతో పాటు, పట్టణంలో సగం వీధులకు ఇదే ప్రధాన శ్మశాన వాటిక అని, కనీస సౌకర్యాలు లేవని అధికారపార్టీ తెదేపా ఉపాధ్యక్షుడు కొండలరావు, పట్టణాధ్యక్షుడు సంతోష్ ఆయనకు వివరించారు. వర్షాకాలం తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోందని కాపు వీధులకు చెందిన తెదేపా నాయకులు ఎస్.రాంబాబు, వెంకటరమణ తదితరులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. స్వర్గధామంగా తీర్చిదిద్దేందుకు చొరవ చూపుతానని జయకృష్ణ హామీ ఇచ్చారు.

మురుగు యాతనకు మోక్షం



స్పందనకు వందనం

పాలకొండ గ్రామీణం, న్యూస్‌టుడే: పాలకొండ ఆర్టీసీ బస్సు ప్రాంగణంలో మురుగు కష్టాలు తీరనున్నాయి. వర్షం కురిసిందంటే ఇక్కడ నీరు రోజుల తరబడి నిలిచి మురుగు కూపంగా మారేది. ప్రయాణికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై ఈనాడులో పలుమార్లు చిత్రవార్తలు వెలువడ్డాయి. దీనిపై ఆర్టీసీ డీఎం పి.వెంకటేశ్వరరావు స్పందించారు. నీరు నిలిచిపోకుండా ఆవరణ శివారులో కాలువ నిర్మాణానికి చర్యలు చేపట్టారు.

నీటి వనరులు శుభ్రం

పార్వతీపురం గ్రామీణం: మండలంలోని పుట్టూరు సచివాలయం మార్గంలో నీటి వనరులు, కాలువను సిబ్బంది శుభ్రం చేశారు. ఇక్కడి పక్కా కాలువ లేక మురుగు నిలిచిపోయేది. సమస్యపై స్థానికులు ఈనెల 18న 'ఈనాడు'కు తెలియజేయగా వార్త ప్రచురితమైంది. ఈవోపీఆర్డీ మూర్తి, కార్యదర్శి లావణ్య స్పందించారు. సిబ్బందితో కాలువలు శుభ్రం చేయించారు.

పురపాలికలో.. సమస్యల తాండవం

పార్వతీపురం పురపాలక, న్యూస్‌టుడే: పార్వతీపురం పురపాలక సంఘం పరిధిలో పలు చోట్ల అభివృద్ధి పనులు చేపట్టక ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. దుగరాజుపేట, జగన్నాథపురం, కొత్తవలస ప్రాంతాల్లో సమస్యలు తాండవిస్తున్నాయి. ప్రణాళికబద్ధంగా పనులు చేయకపోవడంతో పట్టణంలో ఈ పరిస్థితి నెలకొంది.

రూ.56 లక్షలు మంజూరైనా..

పట్టణంలో రైతులు ఎక్కువగా నివసించే జగన్నాథపురం, కొత్తవలసలో ఉద్యానాలు, శ్మశాన వాటికల్లో మౌలిక సౌకర్యాలు కానరావడం లేదు. ఇక్కడ నెహ్రూ కూరగాయల బజారు తీరు అధ్వానంగా మారింది. కాలువలు, విద్యుత్తు, మరుగుదొడ్లు లేక సాయంత్రం 6 తర్వాత వ్యాపారం సాగడం లేదని వ్యాపారులు చెబుతున్నారు. గతంలో అభివృద్ధికి రూ.56 లక్షలు మంజూరైనా పనులు చేయలేదు. పట్టణంలోని 9, 10, 11 వార్డులు, ఇతర ప్రాంతాల నుంచి బైపాస్ రహదారికి చేరేలా దేవాంగుల వీధి శివారున అనుసంధానం మార్గం ఉంది. వీధుల్లో సేకరించిన వ్యర్థాలు ఇక్కడ వేయడంతో పరిసరాలు అధ్వానంగా మారుతున్నాయి.


అభివృద్ధికి దూరంగా ఉన్న బజారు

నిర్వాసితులకు సౌకర్యాలు దూరం..

తోటపల్లి జలాశయ పథకం నిర్మాణంలో ముంపునకు గురైన గ్రామాల ప్రజలకు పట్టణ సమీపంలో స్థలాలు కేటాయించి కాలనీలు నిర్మించారు. నవిరి, గిజబ, కోటవానివలస కాలనీల ప్రజలకు పూర్తిస్థాయిలో సదుపాయాలు కల్పించలేదు. కోటవానివలస కాలనీకి వెళ్లేందుకు రహదారి నిర్మించాలని కోరుతున్నా ఫలితం కనిపించడం లేదు. నవిరి, గిజబ కాలనీలో కాలువలకు రహదారి లేక మురుగు రహదారిపై పారుతోంది. గిజబ నిర్మాణంతో కాలనీలో ప్రభుత్వ స్థలాలు ఆక్రమణలకు గురవుతున్నా పట్టించుకోవడం లేదు. రాజీవ్ కొత్తపొలమ్మ, మణికంఠ కాలనీల్లో వాడుక నీరు బయటకు వెళ్లే ప్రధాన కాలువలు లేక ప్రజలు అవస్థలు పడుతున్నారు.


దేవాంగుల వీధిలో వ్యర్థాలు

దశల వారీగా పనులు..: పుర పరిధిలోని జగన్నాథపురం, కొత్తవలస, పాతబస్టాండ్, రాయగడ రోడ్డు, నవిరి, గిజబ, కోటవానివలస కాలనీల్లో సమస్యలను గుర్తించాం. దశల వారీగా అభివృద్ధి పనులు చేపడతాం. ఉద్యానాలు, శ్మశాన వాటికల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రతిపాదనలు పంపాం. - వి.కిరణ్‌కుమార్, పురపాలక డీఈ

ప్రతిభ చూపారు.. విజేతలుగా నిలిచారు




పార్వతీపురం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం 'ఈనాడు' ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. 'ఇంటర్నెట్ వినియోగం వల్ల లాభనష్టాలు, విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం' అంశంపై 8, 9, 10 తరగతుల వారికి జరిగిన వ్యాసరచన పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని పోటీ పడ్డారు. ఎ.రోహిత్ (తొమ్మిదో తరగతి), జి.విజయసింహ (పదో తరగతి), వి.పల్లవి (తొమ్మిదో తరగతి) వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. విజేతలకు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వి.వరప్రసాద్, ఉపాధ్యాయులు ప్రశంసాపత్రాలు అందజేశారు.
- న్యూస్‌టుడే, పార్వతీపురం

డీఎం దృష్టికి సమస్యలు


ఫిర్యాదులు తెలుసుకుంటున్న భాస్కర్‌రెడ్డి

సాలూరు గ్రామీణం, న్యూస్‌టుడే: బొబ్బిలి మీదుగా రాజాం, పాలకొండ, కొత్తూరు, హడ్డుబంగి, పర్లాఖెముండికి బస్సు సౌకర్యం కల్పించాలని ప్రయాణికులు సాలూరు డీఎంను కోరారు. శనివారం నిర్వహించిన డయల్ యువర్ కార్యక్రమంలో డిపో మేనేజర్ ఎ.భాస్కర్‌రెడ్డి వినతులు స్వీకరించారు. మామిడిపల్లి బస్టాండు, పోస్టాఫీస్ కూడలి వద్ద ట్రాఫిక్ గైడ్‌లను ఏర్పాటు చేయాలన్నారు. అద్దె బస్సు డ్రైవర్లు వాహనాలు ఆపడం లేదని, పంచక్షేత్ర శివాలయాలకు సాలూరు నుంచి బస్సులు నడపాలని కోరారు.

సన్మార్గంలో నడవాలి

గుమ్మలక్ష్మీపురం: మన భవిష్యత్తు మన చేతుల్లోనే ఉందని జాయ్స్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి సంజీవరావు అన్నారు. గుమ్మలక్ష్మీపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ శ్రీవరం ఆధ్వర్యంలో కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ సన్మార్గంలో నడుచుకోవాలన్నారు. వైస్ ప్రిన్సిపల్ రామయ్య, అధ్యాపకులు స్వరూప, కల్పన, తులసి, సింహాచలం ఉన్నారు.

రైతు ఉత్పత్తిదారుల సంఘం ఎన్నిక

వీరఘట్టం, న్యూస్‌టుడే: మండలంలోని రైతు ఉత్పత్తిదారుల పరస్పర సహాయ సహకార సంఘం అధ్యక్షుడిగా కరణం చిన్నంనాయుడు ఎంపికైనట్లు సీసీ ఆనంద్ తెలిపారు. ఉపాధ్యక్షుడిగా చందక సత్తిబాబు, కార్యదర్శిగా కోట శంకరరావు, ఉపకార్యదర్శిగా ఖండాపు హరి, కోశాధికారిగా కె.అసిరినాయుడును ఎంపికయ్యారు.

క్రీడాకారులకు అభినందనలు

కురుపాం గ్రామీణం, న్యూస్‌టుడే: కురుపాం జ్యోతిబాపులే గురుకుల పాఠశాలకు చెందిన పి.నవీన్, జి.శ్రీకాంత్ చదరంగం రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ పి.సత్యనారాయణ, పీఈటీ యు.సత్యం తెలిపారు. వారిని ఎస్ఎంసీ ఛైర్మన్ డి.మణిపూర్ణరావు, ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

సూరంపేటలో భయం భయం

సీతానగరం, న్యూస్‌టుడే: మండలంలోని సూరంపేట పరిసర ప్రాంతాల్లో ఏనుగుల గుంపు సంచారంతో గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తాన్నసీతారాంపురం, సూరంపేటలో వరి, జీడి, మామిడి తోటలను ధ్వంసం చేస్తున్నాయని రైతులు వాపోతున్నారు.

ఆరోగ్య పరీక్షలు తప్పనిసరి

భామిని, న్యూస్‌టుడే: పీహెచ్‌సీల్లో రోగులకు పూర్తిస్థాయిలో ఆరోగ్య తనిఖీలు, నిర్ధారణ పరీక్షలు చేపట్టాలని డీఐవో ఎం.నారాయణరావు సూచించారు. శనివారం బత్తిలి, భామిని పీహెచ్‌సీలను తనిఖీ చేశారు. జ్వరాలు, ఇతర కారణాలతో ఆసుపత్రిలో చేరిన వారి వివరాలపై ఆరా తీశారు. వైద్యాధికారులు దామోదర్, సంతోషిలక్ష్మి, సూపర్‌వైజర్ జయగౌడ, సరస్వతి, గౌరీశ్వరి, కేజీబీవీ ఇన్‌ఛార్జి శారద, ఆరోగ్య సిబ్బంది ఉన్నారు.


వివరాలు సేకరిస్తున్న డీఐవో నారాయణరావు

మత్తు పదార్థాలతో జీవితం చిత్తు

జియ్యమ్మవలస, న్యూస్‌టుడే: మత్తు పదార్థాలతో జీవితం నాశనం అవుతుందని ఎస్ఐ ఎన్.ప్రశాంత్‌కుమార్ అన్నారు. శనివారం బీజేపురం జడ్పీ పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. మాదక ద్రవ్యాలు, సైబర్ నేరాలు, చట్టాల గురించి వివరించారు. హెచ్ఎం రాఘురామరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ ప్రశాంత్‌కుమార్

పక్కాగా సామాజిక తనిఖీలు

గుమ్మలక్ష్మీపురం, న్యూస్‌టుడే: ఉపాధి హామీ పథకంలో చేపట్టిన పనులకు సంబంధించి గ్రామాల్లో చేపట్టనున్న తనిఖీలు పక్కాగా జరగాలని ఎంపీడీవో సాల్మన్‌రాజు పేర్కొన్నారు. గుమ్మలక్ష్మీపురంలో క్షేత్ర సహాయకులు, సర్పంచులు, డీఆర్పీలతో సమావేశమయ్యారు. 2023 ఏప్రిల్-2024 మార్చి మధ్య చేపట్టిన రూ.32.52 కోట్ల విలువైన పనులకు సంబంధించిన తనిఖీలు జరుగుతాయన్నారు. ఇన్‌ఛార్జి ఎస్సార్పీ అప్పలనాయుడు, ఏపీవో బాబూరావు, ఈసీ శేషగిరి ఉన్నారు.

శిథిలావస్థలో ఎన్నాళ్లు..?

గిరిజన సహకార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యావసర సరకుల పంపిణీ డిపోలు చాలా గ్రామాల్లో శిథిలావస్థకు చేరాయి. కురుపాం మండలంలోని గుమ్మ, పి.లేవిడి, మొండెంఖల్లు, నాగరలో ఇదే పరిస్థితి. వర్షాల సమయంలో నీరు కారడంతో నిర్వాహకులు ఇబ్బందులు పడుతున్నారు. సరకులు తడిసి పోతున్నాయని, బాగు చేపట్టాలని కోరుతున్నారు. ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించామని, నిధులు మంజూరైతే పనులు చేస్తామని జీసీసీ డీఎం మహేంద్రకుమార్ తెలిపారు. - న్యూస్‌టుడే, కురుపాం గ్రామీణం



విత్తనశుద్ధి యంత్రం నిరుపయోగం



పాలకొండ ప్రాంత రైతులు విత్తనశుద్ధి చేసుకునేందుకు వీలుగా ఏడేళ్ల క్రితం పీఏసీఎస్‌కు ప్రభుత్వం యంత్రం అందించింది. మంజూరైన నాటి నుంచి దీనిని వినియోగించిన దాఖలాలు లేకపోడంతో పూర్తిగా పాడైంది. ఇక్కడో యంత్రం ఉందనే విషయం కూడా రైతులకు తెలియని పరిస్థితి. అధికారులు మాత్రం యంత్రం వినియోగించేందుకు రైతులు రావడంలేదని చెబుతున్నారు. ఇప్పటికైనా రైతులకు అవగాహన కల్పిస్తే రూ.పది లక్షల విలువైన యంత్రం వినియోగంలోకి వస్తుంది. - న్యూస్‌టుడే, పాలకొండ

బురదలో నరక ప్రయాణం

పాలకొండ పట్టణంలోని వెంకమ్మపేట పీఏసీఎస్ కార్యాలయం వద్ద వర్షం నీరు రోజుల తరబడి నిలిచిపోతుంది. వీధి కాలువలు లేకపోవడంతో వరదనీరు ఎటూ వెళ్లలేని దుస్థితి నెలకొంది. గారమ్మకాలనీలో పలుచోట్లా ఇదే పరిస్థితి ఉంది. దీంతో స్థానికులు, వాహనదారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. శివారు ప్రాంతాల్లో రహదారుల నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని నగర పంచాయతీ కమిషనరు ఎస్.సర్వేశ్వరరావు తెలిపారు.
- న్యూస్‌టుడే, పాలకొండ గ్రామీణం



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

గుమ్మలక్ష్మీపురం, న్యూస్‌టుడే: మండలంలోని కొత్తగూడ గిరిజన సంక్షేమ పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు ఎంపికైనట్లు పీడీ మాధవరావు తెలిపారు. విజయనగరంలో జరిగిన పోటీల్లో ఎ.నవీన్, ఎం.చింటూ, ఎ.శివ ప్రతిభ కనబర్చారు. ● **సాలూరు గ్రామీణం:** జిల్లా స్థాయి పోటీల్లో బొడ్డవలస గురుకుల పాఠశాల విద్యార్థి ఎన్.రంజిత్ ట్రిపుల్ జంపులో, కె.చిరంజీవి షార్ట్‌పుట్‌లో, బి.నూతన్‌కుమార్ జావెలిన్‌త్రోలో స్వర్ణాలు, పి.హర్ష 1500 మీటర్ల పరుగులో, ఆర్.అశంత్ షార్ట్‌పుట్‌లో, ఆర్.రాహుల్ చంద్ 400 మీటర్ల పరుగులో, కె.చరణ్‌తేజ్ డిస్క్‌త్రోలో రజతాలు, పి.హర్ష డిస్క్‌త్రోలో కాంస్యం, కె.ప్రవీణ్, సంతోష్ బాల్‌గేమ్‌లో విజేతలుగా నిలిచారు. వీరిని ప్రిన్సిపల్ ఆశీర్వాదం, తిరుపతిరావు, పీడీ విద్యాసాగర్ అభినందించారు. ● **పాచిపెంట:** గుంటూరులో జరిగిన అంతర్రాష్ట్ర అథ్లెటిక్స్‌లో 5.కి.మీ విభాగంలో బి.హరీష్ ద్వితీయ, 3.కి.మీ పరుగు పందెంలో ప్రథమ స్థానాల్లో నిలిచారు. కోచ్ ఎన్.శేఖర్ అభినందించారు.


శిక్షకులు, ఉపాధ్యాయులతో విద్యార్థులు


సాలూరులో విజేతలుగా నిలిచిన క్రీడాకారులు

విద్యుత్తు స్తంభాల ఏర్పాటు

సీతానగరం, న్యూస్‌టుడే: గ్రామాల్లో విద్యుత్తు స్తంభాలు లేక ఇబ్బందులు పడుతున్నామని ఇటీవల జరిగిన సీతానగరం మండల పరిషత్తు సమావేశంలో పలువురు సర్పంచులు నిలదీశారు. ఏఈ జగన్‌మోహనరావు స్పందించారు. రామవరం, పరిసర ప్రాంతాల్లో స్తంభాలు వేశారు.

జీతాలు చెల్లించాలని నిరసన

సాలూరు గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రభుత్వ ఆసుపత్రులు, వైద్య కళాశాలల్లో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు, సెక్యూరిటీ గార్డులకు పెంచిన జీతాలు చెల్లించాలని ఏఐటీయూసీ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యుడు అశోక్ కోరారు. శనివారం ఆ సంఘం ఆధ్వర్యంలో సాలూరు ప్రాంతీయ ఆసుపత్రి వద్ద ధర్నా నిర్వహించారు. పనికి తగిన వేతనం చెల్లించడంలో అధికారులు అలసత్వం వహించడం ఏంటని ప్రశ్నించారు.

బాల్య వివాహాలతో అనర్థం

పాచిపెంట: బాల్య వివాహాలతో పిల్లలు భవిష్యత్తును నష్టపోతారని ఐసీడీఎస్ సీడీపీవో అనంత లక్ష్మి అన్నారు. అమ్మవలస అంగన్‌వాడీ కేంద్రంలో కిశోర బాలికలు, తల్లులతో సదస్సు నిర్వహించారు. బాలికలకు పౌష్టికాహారం, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. రక్తహీనత నివారణకు ఆకుకూరలు, ఐరెన్ మాత్రలు వాడాలని సూచించారు.

కూటమి ప్రభుత్వంతో గ్రామాలాభివృద్ధి

కురుపాం గ్రామీణం, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వంతో గ్రామాలాభివృద్ధి సాధ్యమని తెదేపా నాయకులు రంజిత్‌కుమార్ నాయకో అన్నారు. మొండెంఖల్లులో పల్లె పండగ నిర్వహించి అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. ఎంపీడీవో జె.ఉమామహేశ్వరి, సర్పంచి గౌరీశంకరరావు, నాయకులు వి.భారతి, వంశీ పాల్గొన్నారు. ❖ **గుమ్మలక్ష్మీపురం:** మూలజమ్ములో అభివృద్ధి పనులకు ఎంపీడీవో సాల్మన్‌రాజు, ఏఈ మురళీధర్, తెదేపా నాయకులు జమ్మయ్య, కామేశ్వరరావు, జానకి తదితరులు శంకుస్థాపన చేశారు.

ఏజెన్సీలో భారీ వర్షం



గుమ్మలక్ష్మీపురంలో రహదారిపై పారుతున్న నీరు

గుమ్మలక్ష్మీపురం, కురుపాం గ్రామీణం, న్యూస్‌టుడే: గుమ్మలక్ష్మీపురం, కురుపాం ఏజెన్సీలో శనివారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. రహదారులు జలమయమయ్యాయి. మండుతున్న ఎండలకు పంటలు ఎండుతున్న తరుణంలో వర్షం కురవడంతో రైతులు హర్షం వ్యక్తంజేస్తున్నారు.

విద్యార్థులకు నేత్ర పరీక్షలు

బలిజిపేట, న్యూస్‌టుడే: మండలంలోని అంపావల్లి పాఠశాలలో వైద్యాధికారిణి మాధురి ఆధ్వర్యంలో నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. 36 మంది విద్యార్థులకు పరీక్షలు చేశారు. తీసుకోవాల్సిన జాగ్రత్తలపై నేత్ర వైద్య నిపుణుడు రమేష్ వివరించారు. పీఎంవో కె.రమేష్, ఆరోగ్య సహాయకులు పి.ఉమామహేశ్వరరావు, ఎంఎల్‌హెచ్‌పీ లావణ్య, హెచ్ఎం ప్రసాదరావు ఉన్నారు.

శివసన్నిధాన భవనం ప్రారంభం



పాలకొండ గ్రామీణం, న్యూస్‌టుడే: పాలకొండలో అయ్యప్ప, శివ, భవానీ దీక్షలు చేస్తున్న భక్తుల ప్రయోజనార్థం నిర్మించిన భవనాన్ని ఎమ్మెల్యే జయకృష్ణ శనివారం ప్రారంభించారు. పాలకొండకు చెందిన తెదేపా నాయకుడు పి.కొండబాబు రూ.7 లక్షలతో తల్లిదండ్రుల స్మారకార్థం నిర్మించారు. తెదేపా పట్టణాధ్యక్షుడు జి.సంతోష్, గురుస్వామి, మునిస్వామి పాల్గొన్నారు.

పరిశీలనకు పోటెత్తిన అభ్యర్థులు

పార్వతీపురం పట్టణం, న్యూస్‌టుడే: కేజీబీవీల్లో ఖాళీగా ఉన్న బోధన, బోధనేతర సిబ్బంది పోస్టులకు దరఖాస్తు చేసిన అభ్యర్థుల ధ్రువపత్రాలు శనివారం పార్వతీపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పరిశీలించారు. ఉదయం 9.30 గంటలకు అని ముందు చెప్పి, రెండు గంటల ఆలస్యంగా ప్రారంభించారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన అభ్యర్థులు పడిగాపులు కాశారు. వరండాలో బల్లలు వేసినా సరిపోక చెట్లు, మెట్ల కింద కూర్చున్నారు. 34 పోస్టులకు 709 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. డీఈవో పగడాలమ్మ, ఏడీలు పర్యవేక్షించారు.


కిటకిటలాడుతున్న గది

శిరస్త్రాణంతో ప్రమాదాల దూరం

సాలూరు గ్రామీణం, న్యూస్‌టుడే: శిరస్త్రాణం లేని ప్రయాణం ప్రమాదకరమని సాలూరు సీఐ అప్పలనాయుడు అన్నారు. శనివారం పట్టణం బైపాస్ రహదారిలో ద్విచక్రవాహనదారులకు అవగాహన కల్పించారు. ఊహించని ప్రమాదం సంభవిస్తే శిరస్త్రాణమే ప్రాణాలను కాపాడుతుందని గుర్తుచేశారు. సాయంత్రం వేళల్లో పట్టణంలో పర్యటించి స్థానికులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు.


అవగాహన కల్పిస్తున్న సీఐ అప్పలనాయుడు